
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
ఆదివారం 23 ఫిబ్రవరి 2025


ఆదివారం ప్రత్యేకం



సైకిల్‌పైనే చుట్టేస్తున్నాడు!

లడఖ్, నేపాల్, గోవా యాత్రలు ఇప్పటికే పూర్తి

త్వరలో భారత యాత్రకు సిద్ధమవుతున్న పలమనేరు వాసి



నేపాల్‌లో బషీర్



చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పేదింట్లో పుట్టిన ఆ యువకుడు మూడేళ్ల క్రితం బీకామ్ పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం సంపాదించుకున్నాడు. రెండేళ్ల తర్వాతఉద్యోగం రొటీన్‌గా మారింది. తనకంటూ ఏదైనా ప్రత్యేక గుర్తింపు కావాలని భావించి ఉద్యోగానికి రాజీనామా చేశాడు. సైకిల్‌పై ప్రపంచం చుట్టాలనుకున్నాడు. గతేడాది జూన్‌లో రూ.3 వేలతో లడఖ్‌కు ప్రయాణమయ్యాడు.లడఖ్ వెళ్లొచ్చిన ఉత్సాహంతో పక్క దేశమైన నేపాల్‌కు కూడా సైకిల్‌పైనే వెళ్లొచ్చాడు. గోవా యాత్ర కూడా పూర్తి చేశాడు.తర్వాతఈ ఉత్సాహంతో ఆలిండియా యాత్రకు సిద్ధమవుతున్నాడు. 'ప్రపంచ ప్రయాణికుడు' పేరుతో సామాజిక మాధ్యమాల్లో తన రైడ్ విశేషాలు వివరిస్తున్నాడు.

పలమనేరు పట్టణం శ్రీనగర్‌కు చెందిన టైలర్ మస్తాన్ బాషా కుమారుడైన బషీర్ డిగ్రీ పూర్తయ్యాక 2024 వరకు బెంగళూరులోని ఫ్లిప్‌కార్ట్‌లో ఇన్‌వెంటరీ మేనేజ్‌మెంట్ టీమ్‌లో పనిచేశారు.ఉద్యోగం మానేశాక యాత్రలకోసం రూ.3 వేలతో సెకండ్ హ్యాండ్ సైకిల్ కొనుగోలు చేశాడు. గతేడాది జూన్‌లో లడఖ్‌కు సైకిల్‌పై పయనమయ్యాడు.రోజుకు రూ.వంద చొప్పున 30 రోజులకు ఖర్చులకోసం రూ.3 వేలతో బయల్దేరాడు. రాత్రిళ్ల పెట్రోల్ బంకుల్లో టెంట్ వేసుకుని నిద్రించేవాడు. నాగపూర్‌కు వెళ్లేటప్పటికి రూ.3 వేలు అయిపోయాయి.ఈ విషయం తెలిసి పలమనేరు నుంచి స్నేహితులు డబ్బు పంపించారు. మార్గమధ్యంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రోడ్డు 'ఉంబ్లింగా పాస్' గుండా ప్రయాణం చేసిన బషీర్ మొత్తం 3400 కిలోమీటర్లు ప్రయాణించి లడఖ్ చేరుకున్నాడు.దీంతో బషీర్‌కు మంచి గుర్తింపు లభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌కు పిలిచి అభినందించారు. తర్వాత పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అభినందించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన శివశంకర్‌రెడ్డి సన్మానించారు.వీరే కాక పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రశంసించారు. చిత్తూరు టీడీపీ నాయకుడు వసంత్‌కుమార్ తన కార్యాలయానికి పిలిపించి ఆర్థిక సాయం చేశారు.

రామ్ ద ట్రావెలర్ నాకు ఆదర్శం

గుంటూరుకు చెందిన 'రామ్ ద ట్రావెలర్' అనే సైకిల్ రైడర్ నాకు ఆదర్శం. ఆయన సైకిల్‌పైనే 13 దేశాలు తిరిగాడు. ఇప్పుడు సింగపూర్ రైడ్‌లో ఉన్నాడు.ఆయనకు యూట్యూబ్‌లో 8 లక్షలు, ఇన్‌స్టాలో 1.44 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.ఆయన్ను ఆదర్శంగా తీసుకునే నేను సైకిల్ రైడ్ ప్రారంభించా. ఆయన నా రైడ్లకు ఆర్థిక సాయం కూడా చేశారు.నా ఆలిండియా రైడ్ కోసం రూ.1.70 లక్షల సైకిల్ ఇచ్చేందుకు ఈ నెలాఖరున ఆయన పలమనేరుకు రానున్నారు.

- బషీర్

● రెండోసారి నేపాల్‌కు..

గతేడాది జూలై 25న నేపాల్‌కు బయల్దేరిన బషీర్‌కు పలమనేరుకు చెందిన ఫయాజ్ రూ.30 వేల విలువ చేసే సైకిల్‌ను బహూకరించారు. 1900 కిలోమీటర్లు ప్రయాణించి నేపాల్ చేరుకున్న బషీర్.. అక్కడ ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగరేశారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 5న పలమనేరు టు గోవా ప్రయాణాన్ని 7 రోజుల్లో పూర్తి చేశారు.

● విజయవాడ వరద బాధితుల కోసం..

తనకు వచ్చిన చిన్నపాటి గుర్తింపుతో బషీర్ ఆపన్నులను ఆదుకునే పని కూడా చేస్తున్నాడు. పలమనేరులోని దుకాణాల వద్దకు వెళ్లి విజయవాడ వరద బాధితుల కోసం బషీర్ విరాళాలు సేకరించాడు. ఆ డబ్బుతో వంద మందికి బట్టలు, స్నాక్స్, మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ తీసుకెళ్లి పంపిణీ చేశాడు.ఇటీవల పలమనేరు కీలపట్ల ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలను అందించాడు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు

మేం పనీపాట లేకుండా వస్తున్నామా?

● సమావేశాలకు రాని జిల్లా అధికారులపై జడ్పీ చైర్మన్, సభ్యుల ఆగ్రహం

● షోకాజ్ నోటీసులివ్వాలని తీర్మానం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుప్పం నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీ సభ్యులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మేము పనీపాట లేకుండా సమావేశాలకు వస్తున్నామా? జిల్లా అధికారులకు ఎందుకు రారు? వారికి బాధ్యత లేదా?' అంటూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు పలువురు గైర్హాజరయ్యారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల కింద స్థాయి అధికారులు సమాధానం చెప్పలేక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు సమావేశాలకు హాజరవుతున్నా.. వివిధ శాఖల జిల్లా అధికారులు రాకపోవడంపై మండిపడ్డారు. గైర్హాజరైన అధికారులందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జడ్పీ చైర్మన్ చెప్పగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలనీ నిర్ణయించారు.

ఎంపీడీవోలు కనీస మర్యాద ఇవ్వడం లేదు

జిల్లాలో ఏ ఎంపీడీవో కూడా జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులకు కనీస మర్యాద ఇవ్వడం లేదని సభ్యులందరూ జడ్పీ చైర్మన్, సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. సమావేశాలకు పిలవడం మానేశారని చెప్పారు. అధికారుల తీరుపై సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తే ప్రభుత్వానికి, జడ్పీ చైర్మన్, సీఈవోకే అవమానమని ఊరుకుంటున్నామన్నారు. ఇక మండలాల్లో ఎమ్మెల్యేల గ్రాంటు ద్వారా పెద్ద పెద్ద పనులు చేస్తున్నారని.. బోర్ల మరమ్మతులు, ట్యాంకులు శుభ్రం చేయడం వంటి చిన్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎందుకు చేయడం లేదని ఎస్ఈని ప్రశ్నించారు. వేసవి మొదలైందని జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కుప్పంలో టీచర్ల తీరుపై ఆందోళన

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల టీచర్ల తీరు ఆందోళన కలిగిస్తోందని కుప్పం జడ్పీటీసీ శరవణ అన్నారు. ఆయన మాటల్లోనే.. 'కుప్పం నియోజకవర్గంలో పనిచేసే సుమారు 100 మందికి పైగానే ప్రభుత్వ టీచర్లు బెంగళూరులో స్థిరపడ్డారు. రోజూ అక్కడినుంచి కుప్పానికి ట్రైన్ ద్వారా వస్తున్నారు. ఈ ట్రైన్ ఉదయం 8.30 గంటలకు కుప్పం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. ఏదైనా కారణంతో ఆలస్యమైతే తొమ్మిది గంటలు దాటుతుంది. పైగా ట్రైన్ దిగిన వెంటనే టిఫిన్లు తిని.. ఆపై స్కూళ్లకు చేరుకోవాలంటే మరో 45 నిమిషాలకంటే ఎక్కువ సమయమే పడుతుంది. అంటే బడులకు సుమారు 9.45గంటలకు చేరుకుంటున్నారు. సాయంత్రం కూడా స్కూల్ వదిలే సమయం 3.45 గంటలకైతే మధ్యాహ్నం 2.45 గంటలకే బయటకు వచ్చేస్తున్నారు. ఎందుకంటే కుప్పం నుంచి బెంగళూరుకు మధ్యాహ్నం 3.15 గంటలకు ప్యాసింజర్ రైలు ఉంది. ఈ రైలు ఎక్కాలంటే సుమారు అరగంట ముందు స్కూల్ నుంచి బయల్దేరాలి' అని వివరించారు. మరికొందరు ఉపాధ్యాయులైతే ఒకేచోట పదేళ్లకుపైగా పాతుకుపోయి రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేస్తూ పాఠశాలలకు వెళ్లడం లేదని, పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని డీఈవోను జడ్పీ చైర్మన్ ఆదేశించారు.

గుంతలను కూడా సరిగా పూడ్చరా?

'ఆర్‌అండ్‌బీ రోడ్లు చాలావరకు గుంతలుపడి ప్రమాదకరంగా మారాయి. కొత్త రోడ్లు వేయాలని కోరితే గుంతలు పూడ్చి చేతులు దులుకున్నారు' అని జడ్పీటీసీ సభ్యులు ఆరోపించారు. ప్యాచ్ వర్కులు కూడా సరిగా చేయక పోవడంతో జనం ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు ఇరువైపులా పిచ్చి చెట్లు పెరిగిపోయాయని, పట్టించుకోకపోతే ఎలా అని అధికారులను చైర్మన్ ప్రశ్నించారు. కుప్పం మండలం నుంచి తమిళనాడుకు కలప అక్రమంగా రవాణా సాగుతోందని సభ్యులు తెలిపారు. నరికేస్తున్న చెట్లలో ఎక్కువగా ఆర్‌అండ్‌బీకి చెందినవే ఉన్నాయన్నారు. శనివారం ఉదయం కూడా పీఈఎస్ కళాశాల ఎదుట రోడ్డుపై ఉన్న చెట్లను నరికేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని కుప్పం జడ్పీటీసీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేద, వైస్ చైర్మన్లు ధనంజయ్‌రెడ్డి, రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

లేని కాలేజ్.. ఉన్నట్లుగా..!?

● కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు ● రంగంలోకి ఇంటర్మీడియట్, రెవెన్యూ అధికారులు
● కళాశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు



కళాశాలలో విచారణ చేపడుతున్న డీవీఈవో సయ్యద్ మౌల

చిత్తూరు సెంట్రల్/పెనుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు దగ్గర పడుతున్న క్రమంలో పెనుమూరులో విచిత్రం జరిగింది. లేని కాలేజ్ ఉన్నట్లు దుమారం రేగింది. ఇక్కడ 88 మంది విద్యార్థులు ఉన్నారని, కళాశాల యాజమాన్యం వీరి పరీక్షల ఫీజు చెల్లించకపోవడంతో, భవిష్యత్ ప్రశ్నార్థంగా మారుతుందనే వాదనలు వినిపించాయి. ఈ సంఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. స్పందించిన కలెక్టర్ విచారణ చేయాలని ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాధికారి (డీవీఈవో) సయ్యద్ మౌలకు ఆదేశాలు జారీచేశారు. ఆయన తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌తో కలిసి శనివారం కళాశాలలో విచారణ చేపట్టారు. అనంతరం అక్కడున్న కళాశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు ఇచ్చారు.

వివరాలిలా..

పెనుమూరులో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జూనియర్ కళాశాల ఉందని, ఇందులో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో 52 మంది బాలురు, 36 మంది బాలికలు చదువుతున్నారని, వీరికి కళాశాల యాజమాన్యం పరీక్ష ఫీజు చెల్లించలేదని ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేసిన అధికారులకు డిగ్రీ కళాశాలలో అసలు జూనియర్ కళాశాల లేదని, దాన్ని మూడేళ్ల కిందటే ఆ యజమాని తిరుపతిలోని బైరాగిపట్టెడలోని ఓ కళాశాల యాజమాన్యానికి విక్రయించారని, విద్యార్థులంతా తిరుపతి వాసులేనని తేలింది. పైగా ఈ వ్యవహారం తిరుపతి రీజనల్ ఇంటర్మీడియట్ అధికారి దృష్టిలో ఉందని తెలిసినట్లు సమాచారం. ఇలాంటి ఇలాంటి మార్పులపై మరింత లోతుగా విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

3నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి మూడు నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఏర్పాట్లపై శనివారం డీఈవో కార్యాలయ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లతో సమీక్షించారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 3419 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 15 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాలో 11, మదనపల్లెలో మూడు, పుత్తూరులో ఒక సెంటర్ గుర్తించామన్నారు. 15 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, మరో 15మంది డిపార్టుమెంటల్ అధికారులు నియమించినట్లు వివరించారు. జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలను ఆదివారం స్ట్రాంగ్ రూంలో భద్రపరచనున్నట్లు తెలిపారు. ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ప్రేమకుమారి, సీనియర్ అసిస్టెంట్ సలార్‌ఖాన్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.... శివయ్య ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి చీరలు కడుతున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామివారి ధ్వజారోహణం శనివారం భక్తుల మధ్య నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామి అమ్మవార్ల మూల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.హారతులు సమర్పించి తొలి ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం, రాజగోపురం మీదుగా దేవాంగ వాహనాల వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి స్వామి, అమ్మవారు వెండి అంబారి వాహనంపై ఆశీనులయ్యారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ పార్వతీ పరమేశ్వరుల పురవిహారం అంగరంగ వైభవంగా సాగింది. అనంతరం ధ్వజారోహణ మహోత్సవానికి అవసరమైన దర్భ, మామిడాకులు, దవళపతాకాన్ని శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. అనంతరం దర్భను ఆలయంలోకి చేర్చారు.స్వామివారి సన్నిధి ఎదురుగా ఉన్న స్వర్ణ తాపడ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వర్ణ తాపడ ధ్వజస్తంభానికి దర్భధారణ చేశాక భక్తులు సమర్పించిన కోడి చీరలు, దవళపతాకం, మామిడి ఆకులు ధ్వజస్తంభానికి ఎగురవేసి, దేవతలకు ఆహ్వానం పలికారు.




పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

నేత్రపర్వంగా శివ పరివార దర్శనం

శివ పరివార దర్శనం నేత్రపర్వంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, రాత్రి రెండుసార్లు పంచమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ముందుగా శివ పరివారమైన వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, భక్త కన్నప్ప, చండికేశ్వరుడు, స్వామి అమ్మవార్లు వెండి అంబారీలపై అధిరోహించి ఊరేగింపుగా సాగారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇవ్వనున్నారు. ఉదయం సూర్యప్రభపై స్వామి వారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

నేడు రేణిగుంటకు సీఎం రాక



తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటకు ఆదివారం సీఎం చంద్రబాబు రానున్నారు.టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరు కానున్నారు.ఆదివారం ఉదయం 10.50 గంటలకు హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధి తుడా రోడ్డులో ఉన్న ఆర్‌వీఆర్ ఫంక్షన్ హాల్లో వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారు. 11.30 గంటలకు వెనుదిరిగి ఎయిర్‌పోర్టు చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా కనపర్తిపాడు వెళతారు.కాగా నరసింహ యాదవ్ తనయుడి వివాహానికి రాష్ట్రవ్యాప్తంగా పలువురు టీడీపీ ముఖ్యనేతలు కూడా హాజరు కానున్నారు.

రేపటినుంచి 'ఆధార్' శిబిరాలు

● నాలుగు రోజులపాటు నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'ఆధార్' శిబిరాలను రెండో విడతగా జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ నిర్వహించనున్నారు. 31 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల్లో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తారు. జిల్లావ్యాప్తంగా ఆరేళ్లలోపు 25,896 మంది పిల్లలకు ఆధార్ కార్డులు లేవని అధికారులు గుర్తించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆధార్ ఆధారంగానే అమలు జరుగుతున్న దృష్ట్యా వీరందరికీ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే 6-15 ఏళ్ల మధ్య 75,452 మంది, 17 ఏళ్లకు పైబడినవారు 86,302 మంది బయోమెట్రిక్ (వేలి ముద్రల నవీకరణ) చేయించుకోవాల్సి ఉంది. వీటితోపాటు వివరాల నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాల మార్పు- చేర్పులు, వ్యక్తిగత చిత్రాల నవీకరణ, సెల్‌ఫోన్ నెంబర్ల మార్పులు, ఇతర దోషాలను ఈ శిబిరాల్లో సరిచేసుకోవచ్చు. మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు శిబిరాలను పర్యవేక్షిస్తారు.



బాల ఆధార్ కార్డు

పేరుతో కూడిన జనన ధ్రువీకరణ తప్పనిసరి

ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేసే సమయంలో వారి పేరుతో కూడిన జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. అలాగే చిన్నారి తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ల వివరాలతో నమోదు చేయించుకుని పిల్లల ఆధార్ కార్డు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

నవీకరణ తప్పనిసరి : 15 ఏళ్లు, అంతకుమించి వయస్సు కల్గినవారికి తమ కనుపాపల పునఃస్వీకరణ (రీకేప్చరింగ్) తప్పనిసరి. ఇలా చేసుకుంటేనే విద్యార్థులకు నీట్, జేఈఈ, ఇతర పరీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతంలో పలు సాంకేతిక కారణాలతో చాలావరకు తిరస్కరణకు గురయ్యాయి. ఈసారి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇతర వివరాలకు ఫోన్ చేయండి

ప్రత్యేక శిబిరాల ద్వారా అర్హత కల్గినవారందరూ ఆధార్ కార్డు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చిత్తూరు జిల్లా సమన్వయకర్త, డీఎల్డీవో రవికుమార్ తెలిపారు. సందేహాలుంటే 91544 09518, 91544 09498 నెంబర్లను ఫోన్ చేయాలని కోరారు.



కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్న కవలలు

కనులపండువగా కవలల వేడుక

ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగాశనివారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూలు హైదరాబాద్, గద్వాల్, బెంగళూరు నుంచి కవలలు హాజరయ్యారు. చిన్నారుల నుంచి పెద్ద వయసు వరకు ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు. భారీ కేక్‌కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ర్యాంపువాక్‌తో కొందరు ఆకట్టుకున్నారు. డ్యాన్సులతో హోరెత్తించారు. విసనొంపైన గాత్రకచేరీలతో మైమరపించారు. ం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి, ప్రాతినిథ్యం వహించిన బహుమతులు ప్రదానం చేశారు. 80 కవల జంటలు కనువిందు చేశారు. సీయూ నెక్స్ ఇయర్ అంటూ బరువైన హృదయంతో ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


చిన్నారి సాహస విన్యాసం

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 23 కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలతో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.52 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,327

తలనీలాలు సమర్పించినవారు : 22,804





పల్లికొండేశ్వరాలయం

పరమశివుని అరుదైన దివ్య రూప సందర్శనం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వీక్షించవచ్చు. శంకరుడు అన్నీ ఆలయాల్లోనూ లింగాకార రూపంలోనే దర్శనమిస్తాడు. ఇక్కడ మాత్రం పార్వతీ ఒడిలో 14 అడుగుల మానుష రూపంలో శివశయనమూర్తిగా అనుగ్రహమిస్తాడు. పార్వతీ సమేతంగా యోగనిద్రలో దర్శనమిచ్చే ఈ పరమేశ్వరుడుని దర్శించుకుంటే తమ కోరికలు శీఘ్రంగా నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వశిస్తారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి

యోగ నిద్రామూర్తి

సురుటుపల్లి పల్లికొండేశ్వరుడు

స్థల పురాణం

ఆలయానికి సంబంధించి స్థల పురాణం ఇలా ఉంది. దేవతలె అమృతంకోసం క్షీర సాగర మధనం చేసినప్పుడు పాల సముద్రం నుంచి కాలకూట విషం వెలువడుతుంది. లోక కళ్యాణార్థం శివుడు దానిని స్వీకరిస్తాడు. విషాన్ని గర్భంలోకి చేరకుండా పార్వతీ దేవి తమ పతి గొంతును నొక్కి పడుతుంది. దీంతో గొంతు భాగం నీలి రంగుగా మారుతుంది. అందుకే శివుడ్ని నీలకంఠుడంటారు. విష ప్రభావానికి లోనైన స్వామి భరించలేని తాపంతో పార్వతి ఒడిలో సేదదీరాడు. శివశయన మూర్తికి ఏర్పడిన స్థితికి చింతిస్తూ సకల దేవతలు వచ్చారు. ఆ రోజు త్రయోదశి మంగళవారం సాయంకాలం ప్రదోష వేళలో మహాదేవుడు విషాహరణ దుస్థితిని వీడాడు. తన కమల నేత్రములను వికసింపజేసి గౌరీ సమేతంగా భక్తులకు అనుగ్రహించాడు. అందుకే క్షేత్రంలో ఆమె పేరు సర్వమంగళా దేవి. సురుటుపల్లి పల్లికొండేశ్వర క్షేత్రం ప్రదోష క్షేత్రంగా వాసికెక్కింది.



వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు...

ఆలయంలో ఏటా 10రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దేవదాయశాఖ నిధులతో పాలకమండలి ఛైర్మన్, ఆలయ ఈవో నేతృత్వంలో చలువపందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు, తాగునీటి వసతులు, పుష్పాలంకరణ వంటివి ఏర్పాటు చేస్తారు. పల్లకి ఉత్సవం, చంద్రప్రభా వాహనం, కామదేను వాహనం, భూతవాహనం, అధికార నంది వాహనం, గజవాహనం, అశ్వవాహనం, వృషభ వాహనం, కల్ప వృక్ష వాహనం, రావణాసుర వాహనాల్లో స్వామి అమ్మవారికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈనెల 26నమహాశివరాత్రి పూజలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. అలాగే 15 రోజులకోసారి ప్రదోష వేళలో ప్రదోష మహానందికి అభిషేకాది పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు.

పేరిలా వచ్చింది..

విష్ణు బ్రహ్మాది సురులు వచ్చినందున సురులపల్లిగా పిలిచేవారు. కాలక్రమేనా సురుటుపల్లిగా మారింది. విజయనగరాధీశుడు హరి హర బుక్క రాయులు క్రీ.శ. 1344-47 లో పల్లికొండేశ్వరుడు నిర్మించారు. పార్వతీ పరమేశ్వరులు ప్రదోష వేళలో సర్వలోకాలను అనుగ్రహించడం వలన ఈదేవాలయం మహాప్రదోష క్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.

పరీక్షా కాలం... ఆరోగ్యం ప్రధానం





- మంచి ఆహారం... నిద్ర తప్పనిసరి
- జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడింది. ఇంటర్‌మీడియట్, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. దీంతో రాత్రి, పగలు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రేయింబవళ్లు చదువుకే కేటాయిస్తున్నారు. సమయానికి ఆహారం, చాలినంత నిద్ర గురించి పట్టించుకోకుండా బిజీ అయిపోతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ప్రధానమని విద్యా నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రతతో చదువు సాగించగలమని సూచిస్తున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



సాత్వికాహారం ఎంతో మేలు

చదివినవి బాగా గుర్తుండాలన్నా, ఏకాగ్రతగా చదవాలన్నా త్వరగా జీర్ణమయ్యే సాత్విక ఆహారం ఎంతో మంచిదని నిపుణులు చెబుతురు. సాత్వికాహారంలోనూ పరిశుభ్రత, సమతుల పోషక విలువలు ఉండేలా చూడాలి. నిర్దేశిత సమయమూ పాటించాలి. మసాలా ఆహారం దరిచేరనివ్వకూడదు. వీధుల్లో విక్రయించే ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని రోజుకు నాలుగు లీటర్ల వరకు తీసుకోవాలి. అన్నం లేదా బార్లీ గంజిని సాయంత్రం వేళల్లో తీసుకోవడం మంచిది. విద్యార్థులు రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. శీతల పానీయాలు తాగకూడదు. రోజుకు అరగంటైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.



పరిశుభ్రతతో ఉత్సాహం

శరీర, పరిసరాల పరిశుభ్రత ఉత్సాహాన్నిస్తుంది. చదువులో నిమగ్నమై స్నానం నిర్లక్ష్యం చేయకూడదు. శరీరం శుభ్రంగా ఉన్నపుడు మంచి మూడ్‌తో... చదివినది మెదడులో నిక్షిప్తమవుతుంది. అలసట వస్తే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. రెండు పూటలా స్నానం చేయాలి. లేదంటే చర్మం పొడిబారి చర్మవ్యాధులు వస్తాయి. దీనివల్ల ఏకాగ్రతకు భంగం కలుగుతుంది.



నిద్రతో ఉపశమనం

అలసిన శరీరానికి నిద్ర ఉపశమనం కలిగిస్తుంది. చాలినంత నిద్ర మరో రోజుపాటు చదువుకోడానికి కావలసిన ఉత్సాహాన్నిస్తుంది. చాలినంత నిద్ర లేకుండా చదవడం అనారోగ్యానికి దారితీస్తుంది... ఏకాగ్రత లేకుండా చేస్తుంది. అందువల్ల రోజూ 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. ఎక్కువసేపు మేల్కొని చదివేందుకు కాఫీ, టీలు అతిగా తీసుకోవడం మంచిది కాదు. సోయాబీన్ పిండి కలిపిన మజ్జిగ తాగితే మంచి శక్తిని ఇవ్వడంతోపాటు పగటి నిద్రను నిరోధిస్తుంది. రాత్రి 10 గంటలసయంలో పాలు తాగితే ఆరోగ్యంతోపాటు నిద్రకూ ఉపకరిస్తుంది.

ఆహార నియమావళి



విద్యార్థులు ఇప్పటినుంచే ఆహార నియమావళి అలవరచుకోవాలి. మూడు పూటలా ఆహారం తీసుకోవాలి. ఏపూటా ఆహారాన్ని స్కిప్ చేయకూడదు. సమతుల ఆహారం తీసుకోవాలి. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్, విటమిన్ బి, జింక్ జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి. రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కోడిగుడ్లు, పండ్లు, పిస్తా, ఆల్మండ్ తదితర నట్స్ ఉండేలా చూసుకోవాలి. పరిమితి మేరకు డార్క్ చాక్లెట్స్ తీసుకోవచ్చు... ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ మెదడును ఉత్తేజితంగా ఉంచుతాయి. బార్లీ జావ మేలు చేస్తుంది.

- కేవీఆర్వీ ప్రసాద్‌రావు, డైటీషియన్, రుయా ఆసుపత్రి, తిరుపతి.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 24నుంచీ నిర్వహించవలసిన దూరవిద్యా పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 24 నుంచీ మార్చి 15 వరకూ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు విధులు కేటాయించారు. చాలా మంది ఉద్యోగులు దూరవిద్యా పరీక్షలకు హాజరు కావలసి ఉంది. దీంతో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ తవమణి తెలిపారు.

సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం ఉత్తమ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన పట్టణ, గ్రామీణ క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- **బాలురు(15నుంచి 18 సంవత్సరాల వరకు):** ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్
- **బాలికలు(18నుంచి 24 సంవత్సరాల వరకు) :** టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం : డీపీవో

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లో ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నామని, తడి చెత్త-పొడిచెత్తపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా గ్రామపంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. శనివారం జిల్లాలో తడిచెత్త-పొడిచెత్త వేరు చేయడంపై అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీపీవో పలు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన తడిచెత్త, పొడిచెత్త ద్వారా చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. గడచిన నాలుగు నెలల్లో వర్మీకంపోస్టు విక్రయం ద్వారా పంచాయతీలకు రూ.7.20లక్షల ఆదాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.


తడిచెత్త-పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న సుశీలాదేవి

బాలికపై అత్యాచారం

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం గాజులమండ్యం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీ పరిధిలో నివాసముంటున్న పవన్(35) శనివారం ఉదయం ఓ 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. కూలి పనులకు వెళ్లొచ్చిన తల్లికి బాలిక ఈ విషయాన్ని తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి


మృతిచెందిన సౌందర్‌రాజన్

చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని కాశిపెంట్ల హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం మారేడుపల్లెకు చెందిన సౌందర్‌రాజన్(43), చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన అశోక్ హెరిటేజ్ ఫ్యాక్టరీలో పాల ట్యాంకర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో అశోక్ ఫ్యాక్టరీలో పాల లోడ్డును దింపేసి, ఫ్యాక్టరీ బయట ట్యాంకర్‌ను పార్క్ చేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సౌందర్‌రాజన్ తన ట్యాంకర్‌ను పార్కింగ్‌లో పెట్టి, దిగుతున్న క్రమంలో ట్యాంకర్ ముందుకు కదిలింది. దీంతో రెండు ట్యాంకర్ల మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు గుర్తించి, చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): త్యాగరాజనగర్‌లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ.20 లక్షల ఆస్తి బుగ్గిపాలైంది. బాధితుల కథనం మేరకు.. శ్రీనివాసతేజ రెసిడెన్సీలో ఐదవ అంతస్తులో రామమోహన్‌రావు కుటుంబం ఉంటోంది. శనివారం తెల్లవారుజామున బెడ్‌రూము ఏసీలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు రావడం ఆయన గమనించారు. అప్రమత్తమై వెంటనే కుటుంబ సభ్యులను బయటకు పంపారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే ఆ శాఖ సిబ్బంది సకాలంలో చేరుకోలేదు. దీంతో మంటలు ఎగసి సామగ్రి కాస్తా అగ్నికి ఆహుతయింది. అగ్నిమాపక యంత్రం వచ్చే సరికి నష్టం జరిగిపోయింది. దాదాపు రూ.20 లక్షల మేర ఆస్థి నష్టం సంభవించిందని యజమాని తెలిపారు. ఈ ఘటనలో పక్క ఫ్లాట్‌వారికి కూడా కొంతనష్టం వాటిల్లింది.

చెత్త పన్ను నుంచి విముక్తి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన చెత్త పన్ను నుంచి ప్రజలకు విముక్తి లభించింది. గతేడాది డిసెంబరు 31 నుంచి చెత్త పన్ను రద్దు అమల్లోకి వచ్చినట్లుగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో సుమారు రూ.1.10 కోట్ల చెత్త పన్నును వైసీపీ అప్పట్లో వసూలు చేసిన విషయం తెలిసిందే. చెత్త పన్ను వసూళ్లను నిలిపివేస్తూ 2024 డిసెంబరులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మున్సిపల్ చట్ట సవరణను అసెంబ్లీ ఆమోదించింది. దానికి గవర్నర్ అనుమతితో ఇటీవలే గెజిట్ విడుదలైంది. తాజాగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది.వైసీపీ ప్రభుత్వం 2021 నవంబరులో ఈ చెత్త పన్ను ను అమలులోకి తెచ్చింది.2022 జూలై నుంచి మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు.చిత్తూరులోని 11 డివిజన్లలో రూ.70 లక్షల చెత్త పన్ను వసూలు చేశారు. పుంగనూరు నుంచి రూ.21 లక్షలు, పలమనేరులో రూ.12 లక్షలు, నగరి మున్సిపాలిటీ నుంచి రూ.8 లక్షల్ని వసూలు చేశారు. మొత్తంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల ప్రజల ముక్కు పిండి మరీ రూ.1.10 కోట్లను వసూలు చేయగలిగారు.మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే మిగిలిన డివిజన్లలో కూడా పన్ను వసూలు చేసేది. కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంతో పట్టణ ప్రజలకు పన్ను విషయంలో ఊరట లభించింది.

భవితలో పిల్లల భవిష్యత్తు మారాలి


మాట్లాడుతున్న డీఈవో కేవీఎస్ కుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తును ప్రగతిపథం దిశగా నడిపించాలని డీఈవో కేవీఎస్ కుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఐఈఆర్‌టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో పిల్లల నమోదును పెంచాలన్నారు. వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లందరికీ భవిత కేంద్రాల ద్వారా అవసరమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంవో శివశంకరయ్య, ఏఏఎంవో మధు, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్


ప్లాంట్ కోసం కేటాయించిన స్థలం

- 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైన పనులు


తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. రూ.12.85 కోట్లతో ఐఓసీఎల్, టీటీడీ సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా తిరుమలలో రోజూ తడి చెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాంకు సమీపంలో ఉన్న డంప్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. ఇలా వచ్చిన చెత్త ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నులు ఉండటం గమనార్హం. దీని తొలగింపు కోసం టీటీడీ ఇప్పటికే చర్యలు చేపట్టింది. కాగా, తడి చెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే అంశంపై టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే తిరుమలలోని కాకులమానుతిప్ప వద్ద ఐఓసీఎల్ ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ఏర్పాటు కోసం 2.22 ఎకరాలు, కంపోస్టు నిల్వ కోసం 0.17 ఎకరాల స్థలాన్ని టీటీడీ ఇప్పటికే కేటాయించింది.

రూ.12.85 కోట్లు కేటాయింపు

ఈ ప్లాంటు నిర్మాణానికి రూ.12.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్లను టీటీడీ సమకూర్చనుంది. ఇప్పటికే ఐఓసీఎల్ ద్వారా బెంగళూరుకు చెందిన జీపీఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. తడి చెత్త ద్వారా వచ్చే ఆహారం, అరటి ఆకులు, చెట్లవేళ్లు వంటి మిక్స్‌డ్ వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారు చేసి, రెండున్నర కిలోమీటర్ల దూరంలోని తరిగొండ అన్నప్రసాద కేంద్రానికి పైపులైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు వేల కేజీల గ్యాస్‌ను వినియోగిస్తోంది. ఈ ప్లాంట్ ద్వారా తడిచెత్తను సమర్థవంతంగా తొలగించడంతోపాటు గ్యాస్ అవసరాలు కొంతలో కొంతైన తగ్గుతాయని టీటీడీ భావిస్తోంది. కాగా, ప్రస్తుతం ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలంలో చదును పనులు పూర్తయ్యాయి.




శివమాలధారణలో భక్తులు - దుర్గంకొండపైకి మెట్ల మార్గం



ఇలకైలాసం దుర్గంకొండ

సోమల, ఆంధ్రజ్యోతి

నిత్యం జలధారలు ఎగసిపడే వాగులు, వంకలు, అంతుపట్టని గుహాలయాలు, కనువిందు చేసే కమనీయ దృశ్యాల శైవక్షేత్రం దుర్గంకొండ.సోమల మండలం పెద్దఉప్పరపల్లె అటవీప్రాంతంలోని ఈ దుర్గంకొండలో వున్న గార్గేయ మహర్షి ఆలయంలో కొలువుదీరిన శివుడు భక్తుల పూజలందుకుంటున్నాడు.గార్గేయ మహర్షి ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు జరిపేవారని పురాణాలు చెబుతున్నాయి.దుర్గంకొండ దిగువన రెడ్డివారిపల్లె సమీపంలో గార్గేయనది ఒడ్డున మోక్షేశ్వరస్వామి ఆలయం, సీతమ్మచెరువుకట్టపై కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరపురం గార్గేయనదీ తీరంలో మల్లేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.



దుర్గంకొండ శిఖరాగ్రంలో కొలువుదీరిన పార్వతీదేవి

గార్గేయనది ఆవిర్భవించే దుర్గంకొండలోని జలాశయం కరువులో కూడా నీటి నిల్వలతో కళకళలాడుతూ ఉంటుంది. అడవి జంతువులు ఇక్కడే దాహాన్ని తీర్చుకుంటాయి. ఈ కొలనులో గార్గేయ మహర్షి రోజూ స్నానమాచరించి తపస్సు చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. దట్టమైన అడవిలో పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పత్రపల్లె గ్రామాలకు చెందిన రైతుల పశువుల మందలు ఇప్పటికీ ఉన్నాయి. ఏడాదిలో ఒక్కసారి ఆ పశువులను సంక్రాంతి కి మాత్రం గ్రామాలకు తీసుకొచ్చి పండుగ తరువాత దుర్గంకొండలో వదిలేయడం జరుగుతుంటుంది. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలతో పాటూ అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రతి పౌర్ణమి రోజున ఇక్కడ భక్తుల సందడి నెలకొంటుంది.కార్తీక, మాఘమాసాల్లో ఈ ప్రాంత భక్తులు వందలాది మంది శివమాలధారణతో ఇక్కడే వుండి పూజలు నిర్వహిస్తుంటారు.



దుర్గంకొండలో శివలింగం

పదేళ్లుగా ఆలయాభివృద్ధి పనులు

పదేళ్లుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శివరాత్రి పర్వదినాన ఈ దుర్గం కొండను సందర్శించి పూజలు చేస్తున్నారు. కాలినడక మార్గంలో వాహనాలు కొండకు వెళ్లడానికి ఆయనే రోడ్డు పనులు చేయించారు. పెద్దిరెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డి దుర్గంకొండలో వినాయక ఆలయాన్ని నిర్మించారు. మెట్ల మార్గం పనులు చేయించారు. దేవదాయశాఖ ద్వారా ప్రత్యేక నిధులు రూ. 8 కోట్లు మంజూరు చేయించడంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆలయానికి ఇలా వెళ్లాలి

సోమల నుంచి 14కిలో మీటర్లు పెద్ద ఉప్పరపల్లెకు బస్సు మార్గం ఉంది. అక్కడి నుంచి 16కిలోమీటర్ల అటవీ మార్గంలో దుర్గంకొండకు చేరుకోవచ్చు. ఈ మార్గంలో నిత్యం ఆటోలు నడుస్తుంటాయి. మహాశివరాత్రి పండుగ రోజుల్లో సోమల నుంచి దుర్గం కొండకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవిందస్వామి



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన గోవిందస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షుడు నాగరాజు, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోవిందస్వామి పేర్కొన్నారు.

శ్రీశైల మల్లన్నకు వరసిద్ధుడి పట్టు వస్త్రాలు



మల్లన్నకు పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న కాణిపాక ఆలయ ఈవో పెంచలకిషోర్, సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి(మల్లన్న)కి శనివారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం తరపున ఈవో పెంచలకిషోర్ తన సిబ్బందితో కలసి శనివారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈవోను మల్లన్న ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీశైలం ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, స్వాములు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కాణిపాక ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి చర్యలు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హోదాలో కలెక్టర్ తొలి సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సూత్రాలు- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా నెలవారీ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి రుణాల మంజూరు, రికవరీలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులు కూడా సొసైటీల వలే ఏర్పడేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సంబంధించినపోస్టర్లను జేసీ విద్యాధరి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీసీవో నాగవర్ధన, డీసీసీబీ సీఈవో శంకర్ బాబు, డీపీవో సుధాకర్‌రావు, డీఈవో వరలక్ష్మి, వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖల జేడీలు మురళీ కృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నూతన కమిటీ



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా జవహర్ బాబు, ఉపాధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా స్వామినాధన్ మోసెస్, ప్రధానకార్యదర్శిగా జయశంకర్, కోశాధికారిగా కవీశ్వర్ నాయుడు, కార్యనిర్వహక కార్యదర్శిగా నర్సానాయుడు, ప్రెస్ కార్యదర్శిగా రవి, సంయుక్త కార్యదర్శిగా హరికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ శాస్త్రి, రమణ రాజు, శవణ్ తేజ్ ఎన్నికయ్యారు.

దేవదాయ శాఖ పరిధిలోకి 16 ఆలయాలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 ఆలయాలు డిప్యూటీ కమిషరు స్థాయి నుంచి జిల్లా దేవదాయ అసిస్టెంట్ కమిషనరు పరిధిలోకి మార్చారు. ఈ మేరకు శనివారం జిల్లా దేవదాయ శాఖకు ఆదేశాలు అందాయి. వార్షిక ఆదాయం రూ. 15 లక్షల లోబడి ఉన్న ఆలయాలు చిత్తూరులోని సప్తకన్నికల, పొన్నియమ్మ గుడి వీరాంజనేయ, తేనెబండ ముత్యాలమ్మ, గిరింపేట చెంగ్రలాయ కొండ సుబ్రమణ్యేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వర, బజారు వీధి శివషణ్ముగ సుందర వినాయక, హైరోడ్డు సుందర వినాయక, పొన్నియమ్మ దేవతా ఆలయాలు ఇకపై జిల్లా దేవదాయ అసిస్టెంట్ కమిషనరు పరిధిలోకి వచ్చాయి. అలాగే కార్వేటినగరం సుబ్రహ్మణ్య స్వామి, గంగాధరనెల్లూరు ఎల్లమ్మ, పుంగనూరు భోగనంజుండేశ్వర, కుప్పం ప్రసన్న వరదరాజ, పలమనేరు సత్యగంగమ్మ ఆలయాలు సైతం దేవదాయ పరిధిలోకి మార్చారు. అలాగే వార్షిక ఆదాయం రూ.50 లక్షలున్న జిల్లాలోని బంగారుపాళ్యం మొగిలీశ్వర, పుంగనూరు మాణిక్య వరద రాజ స్వామి ఆలయాలు తిరుపతి రీజనల్ డైరెక్టర్ స్థాయి నుంచి కర్నూలు డిప్యూటీ కమిషనరు పరిధిలోకి మారుస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిన్న పిల్లల నేరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఒకటవ అదనపు జిల్లా జడ్జి రమేష్



ప్రసంగిస్తున్న ఒకటో అదనపు జిల్లా జడ్జి రమేష్

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు తెలియనితనంలో చేసే నేరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఒకటో అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్ సూచించారు. చిత్తూరు కోర్టు ఆవరణలోని డీఎస్ఎల్ఏ కార్యాలయంలో శనివారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో చిన్న పిల్లల నేరాలపై సమీక్షించారు. బాలల న్యాయ సంరక్షణ, రక్షణ చట్టంపై చైల్డ్ వెల్ఫేర్, పోలీసులకు అవగాహన ఉండాలన్నారు. నేరారోపణ చేసిన పిల్లలను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు 24 గంటల్లో హాజరు పర్చాలన్నారు. ఆ పిల్లలను కొట్టడం, మీడియా ముందుకు తీసుకురాకూడదని హెచ్చరించారు. ఆ పిల్లల్లో మార్పునకు చర్యలు చేపట్టాలన్నారు. జోనల్ జస్టిస్ బోర్డు సంక్షేమాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి, మూడో అదనపు సివిల్ కోర్టు జడ్జి, జేజేబీ సంధ్యారాణి, తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాసరావు, చిత్తూరు న్యాయవాదుల సంఘం కార్యదర్శి సురేష్ రెడ్డి, పోలీసు, మహిళా శిశుసంక్షేమ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ప్రొహిబిషన్ అధికారులు, ఉమ్మడి జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకి క్యూ కట్టిన జనం

336 అర్జీలు స్వీకరించిన విప్ థామస్, అధికారులు



థామస్‌కు టీడీపీ నేతలతో కలిసి పాచిగుంట సర్పంచ్ తరపున వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమనాయుడు

గంగాదరనెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరు మండలంలోని వివిధశాఖల అధికారులు, సచివాలయం మహిళా పోలీస్ ఉద్యోగులతో కలిసి శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకి భారీ స్పందన లభించింది. గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్ ఆవరణం, మీటింగ్ హాలు మొత్తం వివిధ సమస్యలపై అర్జీలను చేతిలో పెట్టుకుని ప్రజలు, టీడీపీ నేతలు సాయంత్రం వరకు క్యూకట్టారు. భారీసంఖ్యలో రావడంతో అదుపు చేయడానికి ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి, పోలీసులకు కష్టంగా మారింది. వచ్చిన అర్జీల్లో చాలా సమస్యలపై మండల అధికారులతో థామస్ చర్చించారు. వారి పరిధిలోలేని సమస్యలపై అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గంగాధరనెల్లూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి 147, రెవెన్యూ పరమైన సమస్యలపై 90, ఇతర మండలాలుకు సంబంధించి 99 కలిపి మొత్తం 336 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, దేవపత్ని ధనంజయ నాయుడు, రాంబాబు రెడ్డి,కామసాని కోదండ రెడ్డి, కేతినేని లోకేష్ నాయుడు,నియాజ్ అలీ, హరీష్ యాదవ్, శరవణ కుమార్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, సీడీపీవో వినతశ్రీ, పంచాయతీరాజ్ డీఈ ఆనందరెడ్డి, వెటర్నరీ ఏడీ మురళీమోహన్, ఎంఈవో ఆంజనేయులు శెట్టి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, విద్యుత్‌శాఖ ఏఈలు వరదరాజులు, తనిగవేలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఉపాధి ఏపీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పాచిగుంటలో జరిగిన భూముల రీసర్వేని రద్దు చేయించండి

జీడీనెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూములు రీసర్వే అస్తవ్యస్తంగా జరిగిందని, దాన్ని రద్దు చేయించాలని సర్పంచ్ పొదిలి విజయమ్మ లెటర్‌ప్యాడ్‌లో సంతకం చేసిన వినతిపత్రాన్ని టీడీపీ నేతలు థామస్‌కు అందజేశారు. ఒకరు భూమి మరొకరికి కలిసిపోవడం, హద్దులు మారిపోవడంతో తగాదాలుపడి పోలీసులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. దీనివల్ల బ్యాంకుల్లో రుణాలు పొందలేక నానాతంటాలు పడుతున్నారని తెలియజేశారు. వెబ్‌ల్యాండ్‌లోనూ భూముల వివరాలు సరిగా చూపించక పోవడంతో సరిచేసేలా చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్ల సమావేశంలో తీర్మానం సైతం చేశామని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

హాస్టళ్లు, కాలేజీల్లో పోలీసుల తనిఖీలు



జీడీ నెల్లూరు మండలం వేపంజేరిలో ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ వాసంతి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణపై జిల్లా పోలీసులు దృష్టి పెట్టారు. మీ కోసం- మీ రక్షణ- మా బాధ్యత అనే నినాదంలో శనివారం జిల్లాలోని పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. ప్రహరీలను, సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక బృందాలతో కళాశాలలు, హాస్టళ్ల వద్ద నిఘా పెట్టి.. ఈవ్‌టీజింగ్, వేధింపులు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని విద్యార్థినులకు తెలియజేశారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం తదితరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 112, 1091, 181, స్థానిక పోలీసు స్టేషన్ల నెంబర్లను పోస్టర్ల రూపంలో ఏర్పాటు చేశారు. ముఖ్యమైన ప్రదేశాలలో, జనసమ్మర్దం అధికంగా ఉన్న ప్రదేశాల్లోనూ ఈ పోస్టర్లను అతికించారు. మహిళల రక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ మణికంఠ పిలుపునిచ్చారు.

నేటినుంచి మొగిలిలో శివరాత్రి ఉత్సవాలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలిలో ఉన్న మొగిలీశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం అభిషేకం, అంకురార్పణతో ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, కార్యనిర్వహణాధికారి మునిరాజ తెలిపారు. రాత్రి మూషిక వాహనంపై వినాయకోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు మార్చి ఐదో తేదీతో ముగుస్తాయన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డురాదు : కలెక్టర్



విజేతలతో కలెక్టర్, జేసీలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు వైకల్యం అడ్డురాదని.. పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనే అయినా రాణించవచ్చని దివ్యాంగ క్రీడాకారులు నిరూపించారంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రశంసించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఈనెల రెండు నుంచి ఆరో తేదీవరకు గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి విభిన్న ప్రతిభావంతుల పోటీల్లో బహుమతులు సాధించిన దివ్యాంగ క్రీడాకారులకు జేసీ విద్యాధరితో కలిసి అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దివ్యాంగ క్రీడాకారులు చేసిన అభ్యర్థను ఆలకించిన కలెక్టర్ రూ.25వేల విలువైన స్పోర్ట్స్ మెటీరియల్స్, వీల్‌చైర్స్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. డీఎస్‌డీవో బాలాజీ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ బాబు, ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంగళంలో తొలగిన మురుగు..!



కాలువలను శుభ్రం చేయిస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మంగళంలో వీధుల్లో మురుగునీటి నిల్వలు ఉండటంతో పాటు పరిసరాల అపరిశుభ్రతపై శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'మంగళంలో లోపించిన పారిశుధ్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీవో లీలామాధవి సూచనల మేరకు ఉదయాన్నే సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని వీధులు, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లించారు. ఇళ్లలోని వ్యర్థపునీరు వీధుల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలిచ్చారు. సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు విద్యార్థికి ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థి శశిశ్రీనివాస్

పలమనేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు చెందిన లక్ష్మీపతి కుమారుడు శశిశ్రీనివాస్ శనివారం చెన్నైలో ఎక్సలెన్సీ అవార్డు తీసుకున్నాడు. రెండు రోజుల క్రితం ప్రకటించిన సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియాలో 11వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అవార్డు అందుకొన్నాడు. స్థానికులు, స్నేహితులు శశిశ్రీనివాస్‌ను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలోనూ న్యాయం జరగదా..?



గంగాధర్‌రెడ్డి

చౌడేపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనూ తనకు న్యాయం జరగడం లేదని టీడీపీ కార్యకర్త గంగాధర్‌రెడ్డి వాపోయారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాటిపేరి పంచాయతీ అగిస్తీగానిపల్లెకు చెందిన తన తాత తిప్పిరెడ్డికి సర్వేనంబరు 75/13లో 48 సెంట్లు భూమి ఉందన్నారు. తాత తిప్పిరెడ్డికి పిల్లలు లేక పోవడంతో ఆయన సోదరులు వెంకటరామిరెడ్డి, మునిరామిరెడ్డి, మునస్వామిరెడ్డిలకు ఆ భూమి వంశపారపర్యంగా ఉమ్మడి ఆస్తిగా అందరికీ సంక్రమించిందన్నారు. ఒక్కో వ్యక్తికి 16 సెంట్లు భూమి హక్కు కలిగిందన్నారు. అయితే ఆ భూమిలో 2009లో ఇల్లు కట్టుకునేందుకు పునాదులు వేశానని.. ఆర్థిక పరిస్థితుల కారణంగా అప్పటి నుంచి పనులు ఆపేశానన్నారు. తన తండ్రి సోదరుడు మునిరామిరెడ్డి కుమారుడు శివశంకర్‌రెడ్డి వైసీపీ నాయకుడు కావడంతో గత వైసీపీ ప్రభుత్వంలో తనను ఇల్లు నిర్మించుకోకుండా ఇబ్బందులు పెట్టేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే ఇల్లు నిర్మించుకుందామని గత ఏడాది డిసెంబరు 26న పునాదుల్లో మొక్కలు తొలగిస్తుంటే శివశంకర్‌రెడ్డి, అతని భార్య సుధారాణి, మరికొందరు కలిసి తనపై డాడి చేశారని తెలిపారు. తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే స్థానిక టీడీపీ నాయకులే కేసు నమోదు కాకుండా అడ్డుపడుతున్నారని వాపోయారు. టీడీపీ గెలుపు కోసం వైసీపీపై పోరాడానని.. తనకు న్యాయం చేయాలని కోరారు.

గురువుకు శిష్యుల నివాళి



నివాళులర్పిస్తున్న ఆయన శిష్య బృందం

సదుం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు అయిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆకుల మునస్వామి(92) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. ఉపాధ్యాయుడి మృతికి స్థానిక బస్టాండు కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు



రైతులకు సూచనలిస్తున్న ఏవో హేమలత

గంగవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఏవో హేమలత పేర్కొన్నారు. శనివారం మండలంలోని కీలపట్ల గ్రామంలో రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయు విధానంపై అవగాహన కల్పించారు. ఇప్పటివరకు గంగవరం మండలంలో 5890 మంది రైతులు గుర్తింపు కార్డుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కీలపట్ల ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ మాధవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వి.కోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దబరిణేపల్లె పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేసినా.. అధికారులు రెండు నెలలుగా పనులు ఆపుతున్నారని సర్పంచ్ శ్రీనివాసులు అధికారులను నిలదీశారు. శనివారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల పరిధిలోని పలు చెరువుల నుంచి అక్రమంగా యంత్రాల సాయంతో మట్టిని తరలిస్తున్నారని.. కట్టడి చేసి చర్యలు తీసుకోవాలని సభ్యులు వాపోయారు. ఉపాధిలో చేసిన పనులకు బిల్లులు రాలేదని, వాటిని ఇప్పుడైనా చెల్లించాలని సభ్యులు డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్, వైస్ ఎంపీపీలు డా.తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులతో ఎస్ఐ, దాతలు

రామకుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన రాజ్యాధికారం టీమ్, రామకుప్పం హనుమాన్ జ్యువలరీస్ వారు స్థానిక ఎస్సీ వసతిగృహం విద్యార్థులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ , రాజ్యాధికారం టీమ్ సభ్యులు నవీన్, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, అశోక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రైతు బాంధవుడు చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

కుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు మేలు చేకూరే నిర్ణయాలు తీసుకుంటూ వ్యవసాయానికి ఊతం ఇస్తున్నారని టీడీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలపతి, గోపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టమోటాకు కనీస మద్దతు ధర రూ.8 గా నిర్ణయించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం టమోటా రైతుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కుప్పంలో అధికంగా ఉన్న టమోటా రైతులు, ఇక ధరల పతనంపై ఆవేదన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే హంద్రీ-నీవా కాలువ నిర్మాణం త్వరలో పూర్తి చేసి కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబు సస్యశ్యామలం చేస్తారని చెప్పారు. పండించే పంటలను దేశవిదేశాలకు ఎగుమతి చేయడానికి కుప్పంలో కార్గో విమానాశ్రయం ఏర్పాటుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ రైతు విభాగం నాయకులు మునస్వామి శెట్టి, రాజా, రమేశ్ పాల్గొన్నారు.

బిందుసేద్యంతో సాగునీటి ఆదా



డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సోమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్ పరికరాలతో నీటిని ఆదా చేయాలని అస్త్రా పాలిమర్స్ ప్రైవేట్ లిమిటెట్ కంపెనీ ప్రతినిధులు గాయత్రి, సోమశేఖర్ తెలిపారు. శనివారం సోమల, నెల్లిమంద పంచాయతీల్లో పలువురు రైతులకు బిందు సేద్య పరికరాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు ఎకరాలల్లోపు ఉన్న రైతులకు గరిష్టంగా రూ.2 లక్షల రాయితీ ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు సుధాకర్, నవీన్, నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

ముచ్చుకాలువ సమస్యలు పరిష్కరించండి

సోమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ముచ్చుకాలువ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని రొంపిచెర్లలో కలిసి విన్నవించారు. బోనమంద నుంచి ముచ్చుకాలువ వరకు రోడ్డు పనుల కోసం నిధులు మంజూరు చేయాలని, గార్గేయ నదిపై వంతెన నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నాయకులు వినతిపత్రం అందించారు. దుర్గంకొండలో మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచ్ బాలాజీ నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల గిరి, రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ బిల్లును రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ సంఘ సభ్యులు

పుంగనూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ట్రాన్స్‌పోర్టు బిల్లును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం పుంగనూరు పట్టణంలోని ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు బిల్లు కార్మికుల మెడకు ఉరితాడులాంటిదన్నారు. బిల్లుతో కోట్లాది మంది ఆటో కార్మికులు నష్టపోతారని తెలిపారు. చదువుకున్న ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి లేక ఆటో నడుపుతూ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. పుంగనూరులో ఆటోలతో జీవనం సాగిస్తున్న పేద కార్మికులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆజాద్ ఆటో డ్రైవర్ల సంఘ నాయకులు ఆంజాద్‌బాషా, మహబూబ్‌బాషా, నవాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



రికవరీ చేసిన బంగారం, యంత్రాలను చూపుతున్న సీఐ

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలను ఉదయం చోరీ చేసి.. రాత్రిళ్లు కరిగించి బిస్కెట్‌గా మార్చి విక్రయిస్తున్న సుహైల్ ఖాన్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి 350 గ్రాముల బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవన్ కథనం మేరకు.... పెనుకొండ నారాయణమ్మ కాలనీలో ఉపాధ్యాయుల ఇళ్లలో జనవరి 20న సుహైల్ ఖాన్ చొరబడి, 470 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బెంగళూరుకు చెందిన సుహైల్ చోరీ చేసినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని, తుమకూరులో శివానగర్‌లో ఈ నెల 13న అరెస్టు చేశామని తెలిపారు. రిమాండ్‌కు తరలించిన అనంతరం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించామని తెలిపారు. నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని కరిగించేందుకు ఆన్‌లైన్‌లో పరికరాలను కొనుగోలు చేశాడన్నారు. బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో విక్రయించాడని తెలిపారు. అక్కడ రికవరీ చేశామని తెలిపారు. బంగారాన్ని కరిగించే యంత్రాలు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 350 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని, ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసినదని, మిగిలిన సొమ్ము కుప్పంలో రెండు చోట్ల చోరీ చేసినదని తెలిపారు. హైదరాబాద్ బంగారం వ్యాపారి కూడా మోసపోయాడని, బంగారం కొని సుహైల్‌కు రూ.29 లక్షలు ఇచ్చాడని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య సాధ్యమని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామనాథంనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదువుకున్న కళాశాలకు, అధ్యాపకులకు పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తులసిరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'తో అంగన్‌వాడీల్లో మెరుగైన బోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎస్‌డీవో ఇంద్రాణి



రొంపిచెర్ల : కృత్యాలు తయారు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పలమనేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎస్‌డీవో ఇంద్రాణి సూచించారు. శనివారం పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సులభమైన పద్ధతుల్లో విద్యాబోధన చేయడానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, హెచ్ఎం షంషీర్, రీసోర్స్ పర్సన్ జి.నాగరాజు, శ్రీత్రిలోక్, చందు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవీలత, ద్రాక్షాయణి, నజ్మా పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంతో అంగన్వాడీ కేంద్రాలు బలోపేతం అవుతాయని ఐసీడీసీ సూపర్‌వైజర్ శిరీష, రీసోర్సు పర్సన్ మనోహర్ పేర్కొన్నారు. రొంపిచెర్ల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పిల్లలకు సులభతరంగా అర్థమయ్యేలా కృత్యాలు తయారు చేయడంపై 37 అంగన్వాడీ కేంద్ర టీచర్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, చౌడేపల్లె మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల కబడ్డీ పోటీలలో చౌడేపల్లె అంగన్‌వాడీ కార్యకర్తలు విజేతలుగా నిలిచినట్లు సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. చౌడేపల్లె జట్టు విజేతగా, పుంగనూరు రన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ వాల్మీకి సంఘ నాయకులు

పలమనేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ శనివారం సాయంత్రం నియోజకవర్గ వాల్మీకి సంఘ నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకి, బోయ సామాజిక వర్గం 1956 నుంచి వివిధ మార్గాల్లో పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏజెన్సీ జిల్లాల్లో వాల్మీకులను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించి మైదాన ప్రాంతాల్లో ఉన్న వాల్మీకులను బీసీ-ఏ కింద గుర్తించిందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సత్యపాల్ కమిటీ ఏర్పాటు చేసి సదరు కమిటీ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు భాస్కర్, నాగేశ్వరరావు, శంకరప్ప, ఆర్.రెడ్డెప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా: చల్లా



చల్లాబాబుని కలిసిన నియోజకవర్గ ప్రజలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో తాను ముందుంటానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద నియోజకవర్గంలోని సోమల, రొంపిచెర్ల, సదుం మండలాలకు చెందిన పలువురు ఆయన్ను కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమాపతినాయుడు, వెంకటేష్, బాలాజీనాయుడు, రాజశేఖర్, నరసింహులు, రొంపిచెర్ల మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, నాయకులు గౌస్‌పీర్‌ఖాన్, షేక్‌కరీముల్లా, రామమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక రంగాల్లో రాణించాలి



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న బీసీఎన్

కుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక రంగాలలో ప్రవేశం అవసరమేనని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో రాణించే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. రాణిస్తున్న కళాశాల విద్యార్థులను, శిక్షణ ఇస్తున్న అధ్యాపకులను ఆయన ప్రశంసించారు. కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజ్ మాట్లాడుతూ 15 ఏళ్లలో తమ కళాశాల సాధించిన విజయాలను తెలియజేశారు. నియోజకవర్గంలోనే న్యాక్ గుర్తింపు పొందిన ఏకైక కళాశాల కేడీసీ అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాశాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్, కేఈసీ వైస్ చైర్మన్ సునీల్ రాజ్, కేడీసీ ప్రిన్సిపాల్ సుధారాణి, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

● మాజీ ఎంపీ చింతా మోహన్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చింతామోహన్

కుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. వర్గీకరణను వ్యక్తిగతంగా తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కుప్పంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతా మోహన్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పరిస్థితులు ఘోరంగా ఉన్నాయన్నారు. పేదలైన ఎస్సీలను విభజించి పాలించడం తప్పన్నారు. దేశ జనాభాలో కనీసం ఒక్కశాతం ఉన్న గుజరాతీ మార్వాడీలకు బ్యాంకు రుణాలు దోచి పెడుతున్నారని ప్రధాని మోదీని విమర్శించారు. జనాభాలో 25 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలు, 50 శాతం ఉన్న ఓబీసీలకు ఒకట్రెండు శాతాలతోనే రుణాలు లభిస్తున్నాయని.. పేదలుగానే ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంలో ఎటువంటి అభివృద్ధి కనిపించడంలేదని విమర్శించారు. కుప్పంలో మీడియాకు స్వేచ్ఛ లేదని, పోలీసులు జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు.

● గట్టిగా అంటే జైలుకు పోతావ్ జగన్

మిత్రుడు వైఎస్సార్ కొడుకు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి హయాంలోనూ, మళ్లీ తాను సీఎంగా ఉన్న సమయంలోనూ అడ్డదారుల్లో వేలకోట్లు సంపాదించి కుబేరుడు అయ్యాడని చింతా మోహన్ విమర్శించారు. ఆయన అడిగిన ఒక్క ఛాన్సూ అయిపోయిందని, ఇక ఇంటికి వెళ్లి బిడ్డలకు పెళ్లిళ్లు చేసి, సంపాదించిన ఆస్తులను కాపాడుకుంటూ కాలం గడపాలని సలహా ఇచ్చారు. పదుల సంఖ్యలో ఇరుక్కున్న జగన్, గట్టిగా అంటే జైలుకు పోతాడన్నారు. ఆయనకు ఇక రాజకీయాలు, సీఎం పదవి ఎందుకని ఎద్దేవా చేశారు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రొంపిచెర్లలో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని అన్ని పంచాయతీలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. ఆయన శనివారం బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం రొంపిచెర్ల నుంచి శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం వరకు పారిశుధ్యం పనులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టరు రమణ, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు జి.ఇమ్రాన్‌ఖాన్, కరీముల్లా, నాయకులు నాగరాజ, తులసీరాం, ఆటో ద్వారక, సయ్యద్‌బాషా, గోవర్ధన్‌రెడ్డి, మహమ్మదాలిబేగ్, బాబులాల్, సహదేవ, ఈవోపీఆర్‌డీ సత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశాలకు ఈనెల 25 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టరు సరళ తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 27వ తేదీన మెరిట్ జాబితా విడుదల చేస్తారని ఆమె తెలిపారు.

వైసీపీ నాయకుడు చీలేపల్లి రవి అరెస్టు

కుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు చీలేపల్లి రవిని అరెస్టు చేసినట్లు కుప్పం అర్బన్ సీఐ పి.శంకరయ్య తెలిపారు. 108 వాహనం ఆలస్యంగా రావడం వల్లే పెయింటర్ మృతి జరిగిందంటూ ఇటీవల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన సంఘటనలో అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పెద్దపంజాణి మండలం వెలగటూరుకు చెందిన మోహన్(21) సొంత పనులపై ద్విచక్రవాహనంలో సీటీఎంకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసు స్టేషన్‌కు వెంకటేగౌడ హాజరు

పలమనేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పోలీసులు నమోదు చేసిన కేసులో కండీషన్ బెయిల్ పొందిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం కోర్టు ఆదేశాల మేరకు పలమనేరు పోలీసు స్టేషన్‌లో సంతకం చేశారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుట్రతో ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రశక్తే లేదని , ఎన్నికల సందర్భంగా వారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజలపక్షాన నిలబడి పోరాడుతామన్నారు.

చింతచెట్టుకు ఆకతాయిల నిప్పు

పలమనేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో జాతీయ రహదారి పక్కన శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని ఆకతాయిలు చింతచెట్టుకు నిప్పుపెట్టారు. చింతచెట్టుకు పొగలు కమ్ముకొంది. గుర్తించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. పలమనేరులో ఆర్టీసీ డిపో వద్ద కొందరు ఆకతాయిలు రోజూ గంజాయి తాగి అల్లర్లకు పాల్పడుతున్నారు. వీరిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై శనివారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన తనూజ (19) ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈనెల 13వ తేదీన కళాశాల నుంచి విద్యార్థిని తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడిందని.. అదే రోజు సాయంత్రం ఆమె ఫోన్ ఆఫ్ కావడంతో ఆమె తండ్రి కళాశాలకు వచ్చి విచారించగా అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అదృశ్యమైనట్లు గుర్తించి ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన యువకుడి మృతి



కల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం చల్లావారిపల్లి సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందినట్లు కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన సురేష్ (27) బూజు కట్టెలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సురేష్ తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో కట్టెలు తీసుకుని చిత్తూరు పరిసర ప్రాంతాల్లో అమ్ముకొని తిరుగు ప్రయాణమయ్యాడు. చల్లావారిపల్లి వద్ద ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న మదనపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

వెదురుకుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై 18 ఏళ్లలోపు పిల్లలందరికీ అవగాహన అవసరమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. శనివారం కార్వేటినగరం బాలికల ఉన్నత కళాశాలలో జరిగిన 'న్యాయ విజ్ఞాన సదస్సు'లో ఆయన మాట్లాడారు. లైంగిక దాడుల నేపథ్యంలో కఠినమైన పోక్సో చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. లైంగికదాడికి, అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, గురువుల దృష్టికి తీసుకుని రావాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ అవసరం ఎంతవరకో అంతవరకే వాడాలని చెప్పారు. తహసీల్దార్ నాగరాజు, ఎస్‌ఐ రాజ్‌కుమార్, ఎంఈవో మంచికాయల విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా నగరి మండల సమావేశం

నగరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరి మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఎంపీపీ భార్గవి అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ప్రారంభమైంది. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. మండల ప్రజాప్రతినిధులకు సమాచారం తెలపకనే అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ వాపోయారు. కార్యవర్గం పూర్తిగా వైసీపీ వారు ఉండటంతో ప్రతి అంశంలోనూ అధికారులపై విమర్శలు చేయడానికే సమయం వెచ్చించారన్న విమర్శలొచ్చాయి.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ భార్గవి

పెనుమూరు సమస్యలు పరిష్కరించిన పవన్‌కల్యాణ్

పెనుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు గ్రామపంచాయతీ సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారని టీడీపీ అధికార ప్రతినిధి ఎన్సీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. తాను పంపిన విజ్ఞప్తి మేరకు జిల్లా అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి 15 రోజుల్లో పంచాయతీ బస్టాండు కాంప్లెక్స్‌లోని 24 గదులను వేలం వేయడానికి నిర్ణయించారన్నారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణం మాస్టర్‌ప్లాన్ ప్రకారం జరిగేలా చర్యలు తీసుకుంటారని వివరించారు. పన్నుల వసూళ్లలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మా కుమార్తె వైద్యానికి సాయం చేయండి: తల్లిదండ్రుల విజ్ఞప్తి



చిన్నారికి ఆర్థిక సాయం అందిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మూర్ఛవ్యాధితో బాధపడుతున్న తమ కుమార్తెకు వైద్యం చేయించడానికి సాయం చేయాలని యాదమరి మండలం కీనాటంపల్లె గ్రామానికి చెందిన శివకుమార్, ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. తమ కుమార్తె పుట్టినప్పటి నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడుతోందని చెప్పారు. వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స అందించామని సుమారు రూ.6లక్షల వరకు ఖర్చయిందన్నారు. ఇప్పటివరకు అప్పులు చేసి చికిత్స చేయించామని తెలిపారు. ఇపుడు రెండో ఆపరేషన్ చేయాల్సి ఉందని అందుకు సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారన్నారు. అంత డబ్బు తమ వద్ద లేదని కన్నీటి పర్యంతమయ్యారు. దాతలు 81977 53717 నెంబరును సంప్రదించాలని కోరారు. బాలిక పరిస్థితి తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ నేతలు తమవంతు ఆర్థిక సాయాన్ని అందించారు.

ప్రధాని మోదీ నాయకత్వంతో దేశాభివృద్ధి: బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో అన్నిరంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించారన్నారు. ప్రతిపక్షాలు సైతం విమర్శించలేని విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు వెల్లడించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, రాష్ట్ర, జిల్లా నాయకులు రవిచంద్రారెడ్డి, రాజేంద్రనాయుడు, ముని నాయుడు పాల్గొన్నారు. అనంతరం మేధావులతో సమావేశం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రూ.2లక్షల ఆర్థికసాయాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. పెనుమూరు మండలం జెట్టిగుండ్లపల్లెకు చెందిన దామోదర్ నాయుడు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన భార్య ఈనెల 17న చిత్తూరులో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అదించాలని కోరారు. దీంతో రూ.2లక్షల చెక్కును శనివారం అందజేసినట్లు కలెక్టర్ వివరించారు. జేసీ విద్యాధరి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున సీఆర్ రాజన్ ప్రచారం



సీఆర్ రాజన్‌తో పాటు జిల్లా టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌తోపాటు పలువురు జిల్లా నేతలు పాల్గొన్నారు. శనివారం గురజాల నియోజవర్గం మాచవరం మండల కేంద్రంలో జరిగిన ప్రచారంలో జిల్లానేతలు మోహన్‌రాజ్, జయచంద్ర నాయుడు, గోపాల్, ధరణి ప్రకాష్, యువరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రంథావిష్కరణ

విజయం విద్యాసంస్థల్లో ఆదివారం సాయంత్రం రచయిత చంద్రశేఖర్ రచించిన 'అందమైన జీవితం' గ్రంథావిష్కరణ జరగనుంది. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

పుస్తక ప్రదర్శన

పీసీఆర్ సర్కిల్‌లో జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రదర్శన ఉంటుందని, సగం ధరలకే ప్రముఖ రచయితల పుస్తకాలు విక్రయిస్తారని పేర్కొన్నారు.

భూ తగాదాల్లో ఇరువర్గాలపై కేసు

గుడిపాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో ఇరు వర్గాలు కొట్టుకోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చింతగుంటూరులో బంధువులైన సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి మధ్య భూ తగాదాల విషయమై ఇరు వర్గాలు కొట్టుకున్నారని చెప్పారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాగుపడుతున్న రోడ్లు



మహావీరపురం వద్ద మరమ్మతులు పూర్తయిన తారురోడ్డు

విజయపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మండలంలోని తారురోడ్లు ఏళ్లతరబడి మరమ్మతులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా బాగుపడుతున్నాయి. ఒరూరు- కమ్మకండ్రిగ రోడ్డు, కేఆర్‌పాళెం - పన్నూరు సబ్‌స్టేషన్‌రోడ్డు, పన్నూరు - జగన్నాథపురం రోడ్డు, క్షూరికాపురం - విజయపురం రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. శనివారం ఈ రోడ్లను ఆర్‌అండ్‌బీ డీఈ దస్తగిరి, జేఈ నర్సింహులు పరిశీలించారు. కాంట్రాక్టర్లు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే జగన్మోహన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో 82 అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. మేయర్ అముద, సహాయ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్లు చంద్రశేఖర్, జయంతి, లోకేశ్వరి, ఎంపీడీవోలు శివరాజ్, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి: డీవీఈవో

పెనుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని విద్యార్థులకు ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాధికారి (డీవీఈవో) సయ్యద్ మౌల సూచించారు. శనివారం జరిగిన పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూతలపట్టు: జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ప్రిన్సిపాల్ పి.స్వరూప, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ప్రిన్సిపాల్ హేమలత, ఎంఈవో గిరిజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ ఎక్కిన వ్యక్తికి పట్టా మంజూరు

పెనుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'నా అనుభవంలో ఉన్న భూమిలో షెడ్డు నిర్మించుకున్నా. అయితే ఆ భూమికి వేరొకరి పేరుతో పట్టా ఉంది. ఇపుడా భూమికి నాకే పట్టా ఇవ్వండి' అని బుధవారం విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన సుబ్రహ్మణ్యంకి ఎట్టకేలకు పట్టా మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఠాణా వేణుగోపాలపురానికి చెందిన విజయలక్ష్మి పేరుతో ఉన్న 20 సెంట్ల డీకేటీ పట్టాను రద్దు చేసి.. షెడ్డు నిర్మించుకున్న సుబ్రహ్మణ్యం పేరుతో ఐదు సెంట్ల పట్టా మంజూరు చేసినట్లు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. కాగా, ఆ భూమిని సర్వే చేయగా వాస్తవానికి అక్కడ ఉన్న భూమి 13 సెంట్లు మాత్రమేనని గుర్తించారు. మిగిలిన 8 సెంట్లు కూడా సుబ్రహ్మణ్యం కుటుంబీకులకే ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విజయలక్ష్మి కుటుంబీకులు మాత్రం తమ పొలానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. సర్వే చేసి దారి చూపిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చినట్లు సమాచారం.

జాబ్‌మేళా క్యాలెండర్ విడుదల

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 28, వచ్చే నెల 4, 14, 18, 24 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న జాబ్‌మేళాకు సంబంధించి ప్రభుత్వం క్యాలెండర్‌ను విడుదల చేసిందని మైనార్టీస్ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధ, జైన్ కులాలకు చెందిన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. https://seedap.ap.gov.in యూత్ రిజిస్ట్రేషన్ కాలమ్‌లో క్లిక్ చేసి కోర్సు వివరాలను చేస్తే వివిధ రంగాలకు చెందిన శిక్షణ కార్యక్రమాల వివరాలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9849 901139 నెంబరును సంప్రదించాలని కోరారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

పూతలపట్టు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంటురోగాల బారిన పడకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో సుధాకరరావు సూచించారు. శనివారం బూజుపల్లె, వేపనపల్లె పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లోని పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ వసంతమ్మ, పంచాయతీ అధికారులు హేమలత, వెంకటరమణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలి

టీచర్లకు ఎంఈవోల సూచన

గుడిపాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని ఉపాధ్యాయులకు ఎంఈవోలు హసన్ బాషా, గణపతి సూచించారు. శనివారం ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వార్షికోత్సవాలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు (దిగవూరు) కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరు బెంగుళూరు నుంచి అప్పుడప్పుడు గంగాధరనెల్లూరుకు వచ్చి వెళ్లేవారు. దీన్ని గమనించిన తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా కలసపాడు తాలుకా తేన్మదిమంగళం గ్రామానికి చెందిన వి.రామజయం(37) ఈ ఏడాది జనవరి 27వతేదీ అర్థరాత్రి ఆ ఇంట్లోకి చొరబడి చోరీ చేశాడు. భానుప్రకాష్‌రెడ్డి ఫిర్యాదుతో చిత్తూరు డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పెద్దకాల్వ పంచాయతీ ఠాణా చెక్‌పోస్ట్ సమీపంలోని చిత్తూరు - పుత్తూరు రహదారిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా రామజయం అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి 30 గ్రాముల బంగారు చైన్లు, చోరీకోసం వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.



బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు

పెనుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై పెనుమూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మనియానాంపల్లె గ్రామానికి చెందిన లక్ష్మయ్య (50)బెల్టుషాపు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో సోదాలు చేశారు. ఐదు క్వార్టరు బాటిళ్లతో పట్టుబడ్డాడు. వాటిని స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మధు తెలిపారు.

ఏడుగురికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మూడు కేసులకు సంబంధించి ఏడుగురికి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి జరిమానా విధించారు. శనివారం రెండో పట్టణ పోలీసులు ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురిపై, న్యూసెన్స్ యాక్ట్ కింద ఒకరిపై కేసు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి.. ఏడుగురికి కలిపి రూ.33,050 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

ఇంటింటా చెత్త సేకరణ

తవణంపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కోసం అరగొండ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం నుంచి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి మురగేషన్ ఆధ్వర్యంలో హరిత రాయబారులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరించారు. ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్తను సేకరించామని ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

నగరి: గ్రామాల్లో ఇంటివద్దకు వచ్చే వాహనంలోనే చెత్త వేయాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

పెనుమూరు: కలవకుంట పంచాయతీ పరిధిలో చెత్తసేకరణపై పంచాయతీ కార్యదర్శి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

కైలాసధామం పనులు త్వరగా పూర్తి చేయండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కైలాసపురంలోని శ్మశానవాటికలో నూతనంగా నిర్మిస్తున్న కైలాసధామం పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. శనివారం సాయంత్రం కైలాసధామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎంహెచ్‌వో లోకేష్, లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి బాల కామాక్షి సమేత కులందేశ్వరాలయంలో శనివారం నుంచి కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకుడు సిద్ధు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంలో శాశ్వతంగా దారి వసతి కల్పించొద్దు

పట్టుబడుతున్న లక్ష్మీపురం కాలనీవాసులు- ప్రభుత్వ భూమిలో దారి ఇవ్వొచ్చన్న తహసీల్దారు





వివాదానికి కారణమైన దారి - తహసీల్దార్‌తో మాట్లాడుతున్న లక్ష్మీపురం కాలనీవాసులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలంలో శాశ్వతంగా దారి వసతి కల్పించొద్దని కార్వేటినగరం మండలం లక్ష్మీపురం కాలనీవాసులు పట్టుబడుతున్నారు. శనివారం వారు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపారు. కాలనీవాసులకు సర్వే నెంబరు 284/2లో 3.10 ఎకరాల స్థలం శ్మశాన అవసరాలకు కేటాయించారు. శ్మశానానికి పైభాగంలో ఉన్న పొలాలకు ఇందులో ఓ దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ దారి రికార్డుపరంగా లేదని స్థానికులు తెలిపారు. తాత్కాలికంగా పంట దిగుబడి తీసుకెళ్లడానికి మాత్రమే ఈ దారిని ఉపయోగించుకోవాలని, ఆ తర్వాత రికార్డు పరంగా ఉన్న కాలిన డక దారిలోనే వెళ్లాలని కాలనీవాసులు చెప్పారు. ఈ నేపథ్యంలో శ్మశానానికి పైభాగంలో ఉన్న రైతు తమకు దారి కల్పించాలని కలెక్టరుకు వినతిపత్రం సమర్పించినట్లు రెవెన్యూ ఉద్యోగులు చెప్పారు. ఇది తెలుసుకున్న కాలనీవాసులు శాశ్వతంగా దారివసతి కల్పించొద్దని తహసీల్దార్ నాగరాజు ఎదుట మొరపెట్టుకున్నారు. అయితే ప్రభుత్వ భూమిలో ఎవరికైనా దారి వసతి కల్పించవచ్చని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా..

ప్యాడ్లు, పెన్నుల వితరణ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీసీఆర్ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులను ఎస్సీ ఎస్టీ స్టేట్ ఎంప్లాయీస్ సర్వీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సివిక్స్ అధ్యాపకుడు చిట్టిబాబు శనివారం వితరణ చేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

ఐరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పుల్లూరు, ఎర్రేపల్లె సచివాలయాలను ఎంపీడీవో ధనలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులందరూ లబ్ధిదారులకు రోజూ అందుబాటు ఉండాలని ఆదేశించారు. ప్రతి అర్జీని పరిశీలించి.. సమస్యను పరిష్కరించాలని సూచించారు.

రీసర్వేని సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు కోరారు. శనివారం కత్తెరపల్లెలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రీసర్వే డీటీ స్వరూపరాణి, సర్వేయర్ బాబు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

130 మందికి కంటి వైద్య పరీక్షలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో శనివారం రాస్, శంకర్ నేత్రాలయ ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. రాస్ ప్రధానకార్యదర్శి వెంకటరత్నం, నాగరాజు, ఉపసర్పంచ్ కుప్పయ్య, కంటి వైద్యులు వేణు, వెంకటముని పాల్గొన్నారు.

కడప మహాసభలకు తరలిన నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కరువు పీడిత రాయలసీమ నీటిసమస్యపై కడపలో జరుగుతున్న మహాసభలకు చిత్తూరు నుంచి రైతు, ప్రజా సంఘాల నాయకులు శనివారం బయల్దేరిన వెళ్లారు. వీరిలో.. రైతు సంఘ నాయకులు జనార్దన్, మునిరత్నం, సీపీఐ నాయకుడు నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు గోపీనాథ్, మణి, చంద్ర, విజయకుమార్, విజయగౌరి, కుమారి, లత, రఘు, చంద్రయ్య పాల్గొన్నారు.

వరసిద్ధుడి గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కొల్లా ప్రభాకర్‌రావు రూ.1,00,116 చెక్కు రూపంలో శనివారం అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలుడికి పూజలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

సబ్సిడీ రుణాలకు 25న ఇంటర్వ్యూలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 25వ తేదీన జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ పేర్కొన్నారు. రుణాల కోసం 946 మంది దరఖాస్తు చేసున్నారని తెలిపారు.

సింహ వాహనంపై ఏకాంబరేశ్వరుడి విహారం



యాదమరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని త్రివేణి సంగమంలో ఉన్న ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం, రాత్రి సింహ, రాత్రి శేష వాహనాలపై స్వామి వారు విహరించారు.

హంస, గజ వాహనాలపై చిదంబరేశ్వరుడు



హంస వాహనంపై స్వామివారు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం, సాయంత్రం హంస, గజ వాహనాలపై స్వామి, అమ్మవార్లు గిరింపేట పురవీధుల్లో విహరించారు. నిర్వాహకుడు కృష్ణమూర్తి, అర్చకుడు మహేష్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'సాగరమథనం'



నగరి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కీళపట్టులో ఉన్న చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని తయారుచేసిన సాగరమథనం ప్రతిమలు ఆకట్టుకున్నాయి. వీటిని గణేశ్ అనే భక్తుడు తన మిత్రులతో కలిసి రెండు నెలలుగా శ్రమించి తయారు చేశాడు. వీరిని ఆలయనిర్వాహకుడు సుబ్రహ్మణ్యం అభినందించారు.